

# మాతృదేవోభవ

## ప్రతి నెలా ఒక పాఠకుడి / పాఠకురాలి మాతృమూర్తికి వందనాలు హరిచందనాలు

### అచ్యుతవల్లి



నా పేరు అచ్యుతవల్లి. మాది ఆంధ్రా. ఒరిస్సా సరిహద్దులో ఒకప్పటి శ్రీకాకుళం. ఇప్పుడు విజయనగరం జిల్లాలోని ఓ మోస్తరు పట్టణం. పార్వతీపురం. నాన్నగారు శ్రీ పంతుల సీతాపతిరావుగారు. అక్కడే పుట్టి, పెరిగి సుమారు 40 సంవత్సరాలపాటు అక్కడి ఆర్.సి.యమ్. సెయింట్ జాన్స్ బాలుర పాఠశాలలో సైన్సు అసిస్టెంటుగా పనిచేసి, ఇపుడు విశాఖపట్నంలో స్థిరపడి బి.వి.కె విద్యా సంస్థలకు ఆనరరీ కరస్పాండెంట్‌గా 2000 సంవత్సరం నుంచీ సేవలు అందిస్తున్నారు. అమ్మ మురళీ అన్నపూర్ణ. నాన్నగారి మేనకోడలు. అర్ధాంగిగా 1964 లో అత్తవారింట ఇంట అడుగుపెట్టిన నాటి నుండీ నేటి వరకూ జీవితాన్ని పరిపూర్ణంగా ఆస్వాదిస్తున్న సాధ్వీమణి. అటు పాత తరానికి, క్రొత్త తరానికి ఒక వారధి. అప్పటి విలువలకు, నేటి సౌకర్యాలకూ ప్రత్యక్ష సాక్షి. ఎప్పటికప్పుడు తనను తాను కాలానుగుణంగా మార్చుకుంటున్న నవీన మహిళ. నాన్నగారు ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్ర ప్రభుత్వ పురస్కార గ్రహీత, ప్రవృత్తి రీత్యా స్నేహ స్వభావుడు, కవి. ఎప్పుడూ బంధుమిత్రుల రాకపోకలతో, శిష్యబృందాలతో మా ఇల్లు కళకళలాడుతూ ఉండేది. నాన్నగారికి ఆనాటినుండీ నేటి వరకూ అన్నిటా కుడి ఎడమగా, కుటుంబంలో ఒక చుక్కానిలా మాకు విలువలు నేర్పిన మా అమ్మ గురించి మీతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

అమ్మ పేరు తలుచుకుంటే పులకరించని మనస్సు ఈ సృష్టిలో ఏదీ ఉండదేమో. అయినా ప్రతి ఒక్కరికీ వారి అమ్మ ప్రత్యేకమే. అలాగే నాకు కూడా అమ్మ. పేరులాగానే నాన్నగారికి మురళి. మాకందరికీ అన్నపూర్ణ స్వరూపం. పదమూడు, పధ్నాలుగు సంవత్సరాల వయస్సులో మా ఇంటికి కోడలుగా అడుగుపెట్టిన నాటినుంచీ నేటి వరకూ ఆమె జీవితంలో ప్రతీ పేజీ ఒక అద్భుతమే. అత్తగారు, మామగార్లు అయిన ఆమె అమ్మమ్మ, తాతయ్యలకు చేసిన సేవలు, వచ్చే పోయే బావగార్లు, తోడికోడళ్ళు, ఆడపడుచులు, మేనల్లుళ్ళు,

మేనకోడళ్ళు కాలం నుంచీ నేడు కూతుళ్ళు, అల్లుళ్ళు, కోడలు, మనుమలదాకా వచ్చేపోయేవారితో అమ్మ నిత్యం ఆ అన్నపూర్ణను మరిపిస్తూనే ఉంది. చదువుల కోసమో, ఉద్యోగాల రీత్యానో ఉండే పర్మినెంటు మెంబర్లు కొందరు, చుట్టపు చూపుగా కొందరు.. నిత్యమూ మా ఇల్లు ఒక కాశీనగరాన్ని గుర్తుకు తెచ్చేది. మా ఇంట పెద్ద తరానికి చిన్న దిక్కు, చిన్నతరానికి పెద్ద దిక్కు అమ్మ. మా కుటుంబంలో ఇంచుమించు 1960ల నుంచి నేటివరకూ నాన్నగారి మొట్టికాయలు, అమ్మ చేతిముద్దలూ తినకుండా ఎవ్వరూ పదవతరగతి పాసయిన దాఖలాలే లేవు. ఆ మాటకొస్తే మా ఊరిలో 1998 లో నాన్నగారి కుటుంబం వదిలేసి విశాఖపట్టణం వచ్చేవరకు జరిగిన అన్ని పదవతరగతి పరీక్షలలోనూ లెఖ్ఖలు, సైన్సు ఫస్ట్ వచ్చిన వారు ఎవరైనా ఉన్నారంటే వారు సీతాపతి మేష్టారి పాఠాలతో పాటు, అమ్మగారి చేతి చలువ కూడా పొందినవారే.

కోర్టుపనుల మీద వచ్చిన పెద పెదనాన్నగారు (పంతుల రామలింగేశ్వర రావు గారు) వెళ్ళిపోతానంటే అమ్మ వేసే మంత్రం "మామయ్యా, రేపటికి దోసల పిండి రుబ్బాను." ఆ రాత్రి పెదనాన్నగారి నోటినుంచీ వెలువడే కాళహస్తీశ్వర శతక పద్యాలు. పాండవ ఉద్యోగ విజయాలు నట్టింట నాట్యమాడుతూ బోసినవ్వుతో ఆయన "మీ అమ్మకి మంత్రాలు వచ్చే" అంటుంటే మాకు సంతోషం ఆగేది కాదు. చిన్న పెదనాన్నగారు (పంతుల విశ్వనాథ రావు గారు. 1960 ప్రాంతాల్లో 'భారతి' పత్రికలో విరివిగా వ్రాస్తుండే వారు) వస్తే మరో మంత్రం. ఆ రాత్రి మొదటి ప్రపంచ యుద్ధం నుంచీ శ్రీకాకుళ నక్సలైట్ ఉద్యమం దాకా అర్ధరాత్రి వరకూ చర్చ. ఊరిలో ఏ సాహితీ సమావేశాలకు ఎవ్వరు వచ్చినా మా ఇంట ఆతిధ్యం ఉండేది. అలాగే ఒకసారి 1981 లోనో, 82లోనో శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు మా ఊరికి వచ్చి మాతో గడపడం ఒక చల్లని జ్ఞాపకం. ఎప్పుడు నిద్రపోయేదో తెలిసేదే కాదు. అయినా రోజంతా తాజాదనమే.

నాన్నగారికి స్కూలు ఇనస్పెక్షనుకు వచ్చిన డి.యి.వోలు, ఎం.యి.వోలూ హోటల్స్‌లో భోజనం చేసే నాగరికత ఇంకా రాని రోజులవి. కబురయినా లేకుండానే వారు అకస్మాత్తుగా వస్తుండేవారు. అమ్మ మీద ఎంత నమ్మకముండేదో మరి. ఇక, నాన్నగారి తోటి టీచర్లందరికీ అమ్మ చిట్టి స్నేహితురాలే. లంచవర్లో వారానికి రెండుసార్లయినా కూర్చుని వెళ్ళవలసిందే మా అందరికీ వైద్యం చేసే డాక్టరు మామ డా. సాహూగారు, తన కథలు మొట్టమొదటిగా అమ్మకి చూడమని ఇచ్చే తెలుగు మామ శ్రీ పి.వి.బి. శ్రీ రామమూర్తి మేష్టారు మా ఇంటికి రెగ్యులర్ విజిటర్లు. వీరందరి ప్రభావమూ మా బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసింది.



వారందరితోపాటు కొంచెం ఎక్కువగా మేము నలుగురం. ముగ్గురు అక్క చెల్లెళ్ళు, మా అందరికీ ఒక ముద్దుల తమ్ముడు. సాయంత్రం స్కూలు నుంచీ ఇంటికి వచ్చేసరికి ఏదో ఒక చిరుతిండి. తరువాత చదువులు. మాతోపాటు ఎనిమిదవ తరగతి దాకా ప్రతీ ఒక్క సబ్జెక్ట్ తను కూడా చదివింది. టైం లేదు అని ఇవాళ మేమెవరైనా అంటే ఒక్కసారి అమ్మ గుర్తుకు వస్తుంది. పెద్దల పట్ల వినయం, సమవయస్కుల పట్ల సహృద్భావం, చిన్నల పట్ల అనురాగం చూపించుకుంటే జీవితంలో ఎటువంటి సమస్యలూ రావు.

"ఇగో లేని జీవితం ఇంపైన జీవితం" అన్న విషయాలను ఆచరించి మాకు చూపెట్టిన మేనేజ్‌మెంటు గురు, రోల్ మోడల్ మా అమ్మ.

వీటన్నిటితో పాటు తన స్నేహితురాళ్ళతో కలిసి మహిళా, డ్యాన్సు క్లాసులూ, మేము ప్రోగ్రాములు ఇస్తున్నామంటే సందడే సందడి. కట్టుకునే డ్రస్సు నుంచీ, పెట్టుకునే క్లిప్పుదాకా అన్నీ తనే దగ్గరుండి చూసుకునేది. పండుగలు వస్తున్నాయంటే విధిగా బజార్లలో

క్రొత్త క్రొత్త మోడల్ డ్రస్సులు చూచి వచ్చి ఇంటిలో రకరకాల గౌనులు కుట్టడం, వాటికి లేసులు అల్లడం, స్వెట్టర్లు అల్లడం ఒకటేమిటి... అన్నీ తను సరదా పడుతూ చేసి మమ్మల్ని సరదా పెట్టేది. ఇవి రోజు వారీ దినచర్యలు.

ఇవికాక స్పెషల్ అకేషన్స్ వస్తూ ఉంటాయి. ఉన్న కాస్త పొలాన్ని చూసుకునే రైతులు వచ్చి "మురళమ్మా, బుగత లేడా" అంటు వస్తే వాళ్ళ బాగోగులు, ధాన్యం బళ్ళు గాదెకి చేరే రోజు వాళ్ళతో పాటు మాకూ పండుగే. ఆ వేడి వేడి అన్నంలో ముద్దపప్పూ, ముక్కల పులుసూ, వంకాయ కూరల ఘుమఘుమలు ఏ స్టార్ హోటల్‌లో ఛీఫ్ చెఫ్‌కు కూడా రావని ఘంటాపథంగా చెప్పగలను. సీజన్‌లో ఏ శిష్యుడో వేయించిన చింత పండు బస్తాలు విప్పదీయించి పిక్కలు తీయించి మాకు కావలసినంత ఉంచి, అయినవారికి వంతుల వారీగా బస్సులెక్కించి పంపడం, కందుల బస్తా వస్తే మనిషితో పాటు తనూ కూర్చుని ఎర్రమన్ను వ్రాసి, కడిగి, ఎండబెట్టి కందిపప్పు రూపంలో తీసుకురావడానికి అమ్మ పడిన శ్రమ ఏ షాపింగ్ మాల్ లోనో కందిపప్పు పాకెట్ చూసినప్పుడల్లా గుర్తుకు వస్తూనే ఉంటుంది.

ఇక వేసవి కాలమంతా మరో హడావిడి. గుండలుకొట్టీ, మామిడి కాయల ముక్కలు తరిగీ పచ్చి ఆవకాయ, ఎండు ఆవకాయ, తొక్కుడు పచ్చళ్ళూ అవి రోజూ ఎండబెట్టి తీయడానికి మేము వంతులు, వీటితో పాటు పేలాలు వేయించీ, ఏరీ, పేలాల ఒడియాలూ, గుమ్మడికాయ వడియాలు. మాకిష్టమని సగ్గుబియ్యం ఒడియాలు. వీటన్నిటితో వేసవి సెలవులు ఎలా గడిచిపోతాయో అర్థం అయ్యేదీ కాదు. ఇలా ఎన్నని తలుచుకోను?

ఉత్తరాంధ్ర మొత్తానికి మొట్ట మొదటిసారిగా 1986 లో నాకు స్టేట్ ర్యాంకు టెంత్ క్లాసులో రావడానికి నాన్నగారి కఠోర శిక్షణ, అమ్మ పడిన శ్రమా రెండూ కారణమే. ఆ రోజు పెద్ద కూతురునైన నన్ను చూసి ఎంత గర్వపడిందో ఏనాడూ తన గురించి పట్టించుకోలేదు. తనకేమి కావాలో ఇప్పటికీ మాకు తెలియదు. కొంచెం ఆఫీసు పని, ఇద్దరు పిల్లల సంరక్షణకే ఎంతో హడావిడి పడుతూ ఉంటే ఒక్కసారి అనిపిస్తుంది అమ్మకి కూడా ఆ భగవంతుడు రెండు చేతులూ, 24 గంటల టైమే ఇచ్చాడు అని.

అమ్మ కార్యక్రమాల ముందు శత సహస్రావధానాలు కూడా బలాదూరే. ఎందుకంటే అవి ఎప్పుడో ఒక్కసారే చేస్తారు. అమ్మకి అవి రోజూ అలవాటే అటువంటి అమ్మకి కూతురిగా మళ్ళీ మళ్ళీ పుట్టాలనుకోవడం స్వార్థమే. అందుకే వచ్చే జన్మలో అయినా తల్లిగా పుట్టి కొంచెం ఋణం తీర్చుకునే అదృష్టాన్ని ఇమ్మని ఆ భగవంతుని వేడుకుంటున్నాను.



**అచ్యుతవల్లి** గారి స్వస్థలం పార్వతీపురం. విజయనగరంలో బి.ఎస్సీ చదివాక ఎల్.ఐ.సిలో అసిస్టెంటుగా చేరి, అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం నెల్లూరు డివిజనల్ ఆఫీసులో ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. గత సంవత్సరమే ఆంధ్రా యూనివర్సిటీ నుంచీ సైకాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ కూడా పొందారు. వీరి భర్త శ్రీ విశ్వనాథ బి.వి. సత్యనారాయణ మూర్తి. కుమారులు శరవణ్ శౌరి, సాకేత్.